క్లుప్తంగా

సీపీఎం జిల్లా కార్యదర్శిగా జయరాజ్


జయరాజ్

జహీరాబాద్ టౌన్: సీపీఎం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జహీరాబాద్‌లో జరుగుతున్న మహాసభల్లో జిల్లా కార్యదర్శిగా గొల్లపల్లి జయరాజ్, కార్యదర్శి వర్గ సభ్యుడిగా బీరం మల్లేశం, సభ్యులుగా రాజయ్య, బి.రాంచందర్, ఎ.మానిక్, జి.సాయిలు, ఎం.నర్సింలు, ప్రవీణ్‌కుమార్, ఎస్.మహిపాల్, యాదగిరి, విద్యాసాగర్, రేవంత్ కుమార్, నాగేశ్వర్‌రావు, కృష్ణ, ఎస్. లలిత ఎన్నికయ్యారు.

ఎయిడ్స్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఝరాసంఘం (జహీరాబాద్): ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్కోప్ స్వచ్ఛంద సంస్థ డీఆర్పీ రమేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎల్గోయి, మచ్నూర్ గ్రామాల్లో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కళాకారులు ఆటపాటల ద్వారా ఎయిడ్స్, సుఖవ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో స్కోప్ సంస్థ ద్వారా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ఉచితంగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించి, వారి వివరాలను రహస్యంగా ఉంచుతామని తెలియజేశారు.

కొనసాగుతున్న ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు


అభిషేకం చేస్తున్న మహిళలు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని హనుమాన్ మందిరం పునఃప్రారంభోత్సవ వేడుకలు కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం మూలవిరాట్ ఆంజనేయస్వామికి మాన్యుసూక్తముచే అభిషేకం నిర్వహించారు. ఆలయంలో స్వస్తి వాచనం, మంటపదేవత హోమం, మహాగణపతి హోమం, పురుషాసుక్త, శ్రీసూక్త, రుద్ర మాణ్యాహోమం, దేవతా విగ్రహాల స్థాపనం శ్యయది వాసం, పుష్పలాది వాసం, మహాహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం


పారాయణంలో పాల్గొన్న భక్తులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో ఆదివారం భజరంగ్ దళ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, వివేకానంద సేవ సమితి జిల్లా అధ్యక్షుడు శేషాద్రి, భజరంగ్ దళ్ జిల్లా నాయకులు మనోజ్, పటాన్‌చెరు భజరంగ్ దళ్ ప్రముఖ శిరీష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్: అనారోగ్య సమస్యతో చికిత్స పొందిన మండల కేంద్రం కంగ్టికి చెందిన కులకర్ణి శ్రీనివాస్‌రావుకు సీఎం సహాయనిధి నుంచి రూ.60వేల చెక్కు మంజూరయింది. సంబంధించిన చెక్కును ఆదివారం ఖేడ్ బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చేతులమీదుగా అందజేశారు. రాంచందర్‌ండా, వంగ్దాల్ మాజీ సర్పంచిలు రాంసింగ్, జైపాల్ పాల్గొన్నారు.


జహీరాబాద్ బస్టాండ్ వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, పార్టీ శ్రేణులు


వట్‌పల్లిలో రహదారిపై ధర్నా..

హోరెత్తిన నిరసనలు

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డాయి. ఆదివారం సంగారెడ్డి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతాప్రభాకర్ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా రైతులు ఎక్కడికక్కడ నిరసన, ధర్నాలు, రాస్తారోకోలు, సీఎం దిష్టిబొమ్మలను దహనం చేశారు. రుణమాఫీ, రైతు భరోసా నిధులు విడుదల చేసే వరకు వదిలే ప్రసక్తే లేదన్నారు. అమలు కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కారని ఆరోపించారు.


మునిపల్లిలో..


జోగిపేట: బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో


సిర్గాపూర్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం..


సదాశివపేట: పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద..


కల్హేర్‌లో ధర్నా చేస్తున్న నాయకులు


సంగారెడ్డి టౌన్: సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు


రాయికోడ్: నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

బంగారు ఆభరణాల చోరీ

నారాయణఖేడ్: ఓమహిళ బ్యాగులోంచి గుర్తు తెలియని దుండగులు 6.30తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. బాధితురాలి కథనం ప్రకారం.. నాగలిద్దా మండలం ఎనక్‌పల్లికి చెందిన నిర్మల కొన్నేళ్లుగా కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటుంది. సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్‌లోని బంధువుల ఇంట్లోని ఫంక్షన్‌కు ఆదివారం వచ్చింది. తిరిగి హైదరాబాద్‌కు వెళ్లడానికి ఖేడ్ రాజీవ్‌చౌక్‌లో బస్సు ఎక్కుతుండగా ఎవరో బ్యాగును పట్టుకున్నట్లు అనిపించి అనుమానంతో బ్యాగును పరిశీలించగా అందులో 6.30 తులాల నెక్లెస్, లాంగ్ చైన్ తదితర బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో బాధితురాలు ఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కేదార్‌నాథ్ సన్నిధిలో నగేష్

నారాయణఖేడ్: కేదార్‌నాథ్ జగద్గురు 1008 భీమాశంకరి శివాచార్యులు ఆదివారం కర్ణాటకలోని బీదర్‌కు వచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్, ఆయన సోదరి ప్రవీణ బస్నాలే తదితరులు బీదర్‌కు వెళ్లి ఆయనను దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు.

బాచేపల్లిలో కుక్కల బెడద

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలం బాచేపల్లిలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామంలో ఇద్దరిని కుక్క కాటు వేసింది. కుక్కల బెడదను అరికట్టడంలో అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్టీలకతీతంగా హక్కుల సాధనకు కృషి

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్


సమావేశంలో మాట్లాడుతున్న మధుముదిరాజ్

పటాన్‌చెరు: సామాజిక న్యాయం కోసం పార్టీలకతీతంగా ముదిరాజ్ అందరూ ఒకే తాటిపైకి రావడం సంతోషంగా ఉందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ నియోజకవర్గం చక్రిపురం క్రాస్‌రోడ్ సిరి గార్డెన్‌లో కుషాయిగూడ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్..బలయ్ కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే లక్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవిలతో కలిసి నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని, త్వరలోనే బీసీ కుల గణన పూర్తి అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మన ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యువత అధ్యక్షుడు పండగ బాలు, నాగరాజ్, పాండు, శంకర్, శ్రీకాంత్, హరి బాబూ, ముదిరాజ్ కుల బంధువులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ

పటాన్ చెరు టౌన్: దేవాలయాల నిర్మాణాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుందని కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ అన్నారు. ఆదివారం గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండలం తున్కి ఖల్సా గ్రామంలో మత్స్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెద్దమ్మతల్లి దేవాలయ నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఇన్‌చార్జి నర్సారెడ్డి , కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు నీలం మధుముదిరాజ్‌ను, సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. గ్రామాల్లో అమ్మవారికి బోనాలు, జాతర ఉత్సవాలు నిర్వహించడంతో ప్రజల మధ్య ఐక్యమత్యం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు మోహన్, విద్యాకుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సాయిగౌడ్, నర్సింహులు, రాజశేఖర్‌రెడ్డి, శేఖర్, రవి, శ్రీను, ఉత్సవ నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంగారెడ్డి వరకు మెట్రో లైన్‌ను పొడిగించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కరాములు


మహాసభలో చుక్క రాములు

జహీరాబాద్ టౌన్: మెట్రో లైన్‌ను సంగారెడ్డి వరకు పొడగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు కోరారు. పట్టణంలో జరుగుతున్న సీపీఎం మహాసభలకు హాజరై ఆయన మాట్లాడారు. జిల్లా ప్రజల రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు మెట్రో రైల్వే లైన్‌ను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. సింగూర్, మంజీరా జలాలు జిల్లా ప్రజలకు అందించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు తాగు, సాగుకు నీరు సరఫరా చేయాలని అన్నారు. మంజీరా జలాలు కలుషితమవుతున్నాయని, నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలిపారు. కార్మిక చట్టాలను అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు వీరయ్య మాట్లాడుతూ.. హామీలను అమలు చేయకుంటే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్నారు. మహాసభ రెండవ రోజు ఆదివారం 15 అంశాలపై ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. సమావేశంలో జహీరాబాద్ ప్రాంత కార్యదర్శి బి.రాంచందర్, జిల్లా కార్యదర్శి జయరాజ్, నాయకులు బి.మల్లేశం, రాజయ్య, మాణిక్, సాయిలు, నర్సింలు, మహిపాల్, యాదగిరి, విద్యాసాగర్, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): క్రీడల్లో గెలుపోటములు సహజమని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. మండల పరిధిలోని దొంతి గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు భవనగారి శ్రీనివాస్ క్రికెట్ పోటీలు నిర్వహించగా, ఆదివారం విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు, యువకులు నచ్చిన క్రీడల్లో రాణించాలని ఈ సందర్భంగా వారు అన్నారు. మొదటి విజేత జట్టుకు 17,500, ద్వితీయ జట్టుకు 10,000 నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, నాయకులు లక్ష్మీకాంతారావు, మురళి, రాజు, తదితరులు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



శివ్వంపేట(నర్సాపూర్): తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన మండల పరిధిలోని చిన్నగొట్టిముక్కల గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శంకర్‌గౌడ్ శనివారం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఉన్న విషయం గుర్తించిన పక్కింటి వారు శంకర్‌గౌడ్‌కి సమాచారం ఇవ్వడంతో వచ్చి చూసేసరికి బీరువాలోని అరతులం బంగారం, 25 తులాల వెండి వస్తువులు, నగదు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శంకర్‌పాటిల్‌కు సన్మానం


శంకర్ పాటిల్‌ను సన్మానిస్తున్న గంగామాతాజీ

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్‌కు చెందిన రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ పాటిల్‌ను కర్నాటకలోని బసవపీఠం మహిళా జగద్గురు గంగా మాతాజీ సన్మానించారు. బసవకల్యాణ్‌లో జరుగుతున్న కల్యాణ పర్వమేళల్లో భాగంగా ఆదివారం పాటిల్‌ను ఘనంగా సన్మానించారు. తెలంగాణలో లింగాయత్ సమాజ్ అభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేస్తున్నారు. జహీరాబాద్ కేంద్రంగా రాష్ట్రీయ బసవదళ్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. విశ్వగురు బసవేశ్వరుడి ప్రవచనాలను ఊరూరా ప్రచారం చేస్తూ విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. ఈ మేరకు గంగామాతాజీ ఆయనను సన్మానించి, ఆశీర్వదించారు. కల్యాణ పర్వమేళకు జహీరాబాద్ నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివెళ్లారు.

ఇళ్ల మధ్య మురుగు


ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని కలివేములలో ఇళ్ల మధ్య మురుగు నీరు పారుతోంది. దీంతో ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. గ్రామంలోని కొత్తకాలనీలో మురికి నీటి కాల్వలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరంతా రోడ్డుపైకి చేరి దుర్వాసన వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. దోమలు ఎక్కువై రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డంతా మురికి నీరు పారుతుండడంతో నడవడం కష్టంగా మారిందని తెలిపారు. అధికారులు స్పందించి గ్రామం నుంచి కాలనీ వరకు మురికి కాలువలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


మాట్లాడుతున్న అశోక్ తదితరులు

నారాయణఖేడ్: సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సీహెచ్. అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణఖేడ్‌లో జరిగిన డివిజన్‌స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖేడ్‌లోని కొన్ని వసతిగృహాల్లో మెను ప్రకారం నాణ్యమైన భోజనం, టిఫిన్, పండ్లు, గుడ్లు, పాలు, చికెన్ ఇవ్వడం లేదన్నారు. ఆదివారం కొన్ని హాస్టళ్లలో టిఫిన్ సరిపడా పెట్టకపోవడంతో విద్యార్థులు బయట హోటళ్లలో టిఫిన్ తెచ్చుకొని తింటున్నారని ఆరోపించారు. మెను ప్రకారం ఆహారం అందించని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, విద్యార్థుల పక్షాన ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సంఘం డివిజన్ నాయకులు రాజు, ప్రవీణ్, నిఖిల్, రోహిత్ పాల్గొన్నారు.

సీడీసీ చైర్మన్‌ను కలిసిన రైతులు


రాంరెడ్డిని సన్మానించిన రైతులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని మెలగిరిపేట్‌కు చెందిన రైతులు ఆదివారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చెరుకు రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో చెరుకు పంట విస్తీర్ణం పెంచడానికి కృషి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన చెరుకు పంట విస్తీర్ణం పెంచడంతో పాటుగా కావాల్సిన సదుపాయాలను కల్పిస్తానని తెలిపారు. అంతకుముందు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో రైతులు శివారెడ్డి, నరసింహారెడ్డి, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, ఆంజనేయులు, మాలే మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

బావిలో గుర్తు తెలియని మృతదేహం



సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని మహేశ్వరి థియేటర్ వెనుక ఉన్న మాడిచేట్టి రాచయ్య బావిలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్లు ఉండి, బాయి పక్కన తుమ్మ చెట్ల వద్ద గోధుమ కలర్ ప్యాంటు, చెప్పులు, షేడ్ అయిన కలర్ బినియన్, గీతలు గల తెల్లషర్టు, షర్టు కాలర్‌కు తాజ్ టైలర్ సంగారెడ్డి అని ఉంది. మృతుడు బావిలో గణేశ్ విగ్రహాల ఇనుప చూవ్వలు తీయడానికి బావిలో దిగి మరణించినట్లుగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


మారేపల్లిలో.. ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు


జహీరాబాద్ టౌన్: పూర్వ విద్యార్థులు


తేర్పోల్‌లో .. పూర్వ విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఎంఆర్‌హెచ్ఎస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 1880–81 సంవత్సరంలో ఎస్ఎస్‌సీ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి గత అనుభవాలు పంచుకున్నారు. 43 సంవత్సరాల తరువాత కలుసుకున్న వారంతా కలిసి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఫొటోలు దిగారు. పూర్వవిద్యార్థుల్లో బీఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం కూడా ఉన్నారు. కార్యక్రమంలో నాగభూషణం, టీచర్ నర్సింలు, డానియల్, మాణిక్‌రెడ్డి, లలిత, అనిత, సుజాన్, రవిచందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్(సంగారెడ్డి)లో..

మండల పరిధిలోని మారేపల్లి, తేర్పోల్ గ్రామాల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తేర్పోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించి 1992–93 పదవ తరగతి విద్యార్థులు , మారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995–96 పదవ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలు, తీపి గుర్తులను, చేసిన అల్లరిని మరోసారి గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు సైతం ఆత్మీయ సమ్మేళనానికి హాజరై సలహాలు , సూచనలు చేశారు. తేర్పోల్‌లో విద్యార్థులు 31 సంవత్సరాల తరువాత కలుసుకోవడంతో కుటుంబ విశేషాలు, వారి జీవిత విశేషాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనానికి విచ్చేసిన అలనాటి గురువులను ఘనంగా సత్కరించారు.